క్లుప్తంగా

వైఎస్సార్‌సీపీ అధినేతతో భేటి



వైఎస్‌ జగన్‌ను కలిసిన ఆవుల కుటుంబ సభ్యులు

సంబేపల్లె : వైఎస్‌ఆర్‌ కాంగ్రెస్‌ పార్టీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్‌ జగన్‌మోహన్‌రెడ్డిని మంగళవారం ఆవుల కుటుంబసభ్యులు కలిశారు. ఈ సందర్భంగా డీసీఎంఎస్‌ మాజీ చైర్మన్‌ విష్ణువర్ధన్‌రెడ్డి, హర్షవర్ధన్‌రెడ్డి, మల్లికార్జునరెడ్డిలు తాడేపల్లిలోని నివాసంలో జగన్‌ను కలిశారు. ఆవుల వేణుగోపాల్‌రెడ్డి మృతిపై జగన్‌మోహన్‌రెడ్డి సంతాపం వ్యక్తం చేసి కుటుంబ సభ్యులను ఆయన పరామర్శించారు.

వినాయక చవితి శుభాకాంక్షలు



రాయచోటి టౌన్‌ : విజ్ఞానానికి సంకేతం, విజయానికి మార్గదర్శి, సర్వవిఘ్నాల అధిపతిగా శ్రీ వినాయకుడు నిలుస్తాడని వైఎస్సార్‌ సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, మాజీ ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్‌ రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం ఆయన సాక్షితో మాట్లాడుతూ వినాయకుడు అంటే అంకితభావానికి, అదృశ్యశక్తికి, అసాధ్యాన్ని సుసాధ్యమయ్యే బలానికి నిలువు దర్పణమన్నారు. భక్తులు వినాయకుడికి పూజలు చేయడం ఎంత ముఖ్యమో భూమాతను కాపాడటం కూడా అంతే ముఖ్యమేనన్నారు. అందుకోసం మట్టి గణపతులను ఉపయోగించి ప్రకృతిని కాపాడాలని సూచించారు. ప్రజలు, రైతులు, సుఖసంతోషాలతో ఆరోగ్యంగా ఉండాలని ఆయన ఆకాంక్షించారు. ఈ సందర్భంగా నియోజకవర్గ ప్రజలకు వినాయక చవితి శుభాకాంక్షలు తెలియజేశారు.

సీజనల్‌ వ్యాధుల పట్ల జాగ్రత్త వహించండి

సిద్దవటం : సిద్దవటంలోని ముప్పై పడకల ప్రభుత్వ కమ్యూనిటీ వైద్యశాలలో సీజనల్‌ వ్యాధుల బారిన పడిన రోగులు సంఖ్య పెరగడంతో వైద్యులు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై తగు సూచనలు అందించారు. ఈ సందర్భంగా డాక్టర్‌ చిరంజీవి రెడ్డి మాట్లాడుతూ సీజన్‌ వ్యాధుల పట్ల జాగ్రత్త వహించాలని, ముఖ్యంగా గృహ పరిసరాలలో నీటి గుంతలు లేకుండా చూడాలని దోమలు ఉత్పత్తి కాకుండా మీ గృహాల్లో ఉండే పూలమొక్కల్లో నీరు లేకుండా చూడాలని రాత్రి వేళల్లో ప్రతి ఒక్కరూ దోమతెరలు వాడాలని, తాగునీటిని కాసి చల్లార్చిన నీరు తీసుకోవాలని, సీజనల్‌ వ్యాధులు పట్ల జాగ్రత్త వహించాలన్నారు. కార్యక్రమంలో డాక్టర్‌ ప్రకాష్‌, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

మట్టి విగ్రహాలు పంపిణీ



రాజంపేట టౌన్‌ : రాజంపేట పట్టణంలో మంగళవారం పలువురు మట్టితో తయారు చేసిన వినాయకుడి విగ్రహాలను ప్రజలకు ఉచితంగా పంపిణీ చేశారు. సాయినగర్‌లో సుంకర సుబ్బరాయుడు, లక్ష్మీదేవి దంపతులు, మన్నూరులో గంగనపల్లె వెంకటరమణ, హైమావతి దంపతులు, వాసవీ కాంప్లెక్స్‌ వద్ద శ్రీవాసవీ సహృదయ సేవాట్రస్ట్‌ ఆధ్వర్యంలో మట్టి విగ్రహాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణ కోసం తమవంతు బాధ్యతగా ప్రజలకు మట్టి విగ్రహాలను పంపిణీ చేసినట్లు తెలిపారు.


బ్యాంక్‌ మేనేజర్‌ సేవలు మరువలేనివి



బ్యాంక్‌ మేనేజర్‌ను సన్మానిస్తున్న ఖాతాదారులు

వీరబల్లి : వీరబల్లి మండల ఏపీజీబీ మేనేజర్‌ మనోహర్‌ సేవలు మరువలేనివని వీఆర్‌డీఎస్‌ సురేంద్రారెడ్డి తెలిపారు. మంగళవారం బదిలీపై వెళ్తున్న మేనేజర్‌ను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా సురేంద్రారెడ్డి మాట్లాడుతూ మనోహర్‌ వినియోగదారులకు మెరుగైన సేవలు అందించడంతో ఖాతాదారులు మన్ననలు పొందారని కొనియాడారు. కొత్తగా బాధ్యతలు చేపట్టిన మేనేజర్‌ గోవర్ధన్‌ రెడ్డి వినియోగదారులకు సేవలు అందించి మంచి పేరు తెచ్చుకోవాలని కోరారు.

పాఠశాలలో చవితి వేడుకలు



పుల్లంపేట : మండలంలోని కొత్తపేట జిల్లా పరిషత్‌ ఉన్నత పాఠశాల, ప్రత్యూష పాఠశాలలలో ముందస్తు వినాయక చవితి వేడుకలను మంగళవారం ఘనంగా నిర్వహించారు. పర్యావరణానికి హాని కలుగకుండా మట్టితో చేసిన వినాయకులకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. విద్యార్థులందరూ ముందస్తు వినాయక చవితి వేడుకలలో పాల్గొని స్వామివారికి పూజలు చేశారు. అనంతరం ఉపాధ్యాయులు వినాయక పండుగ విశిష్టతను విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో కొత్తపేట ఇన్‌చార్జ్‌ హెడ్‌మాస్టర్‌ సుబ్బారెడ్డి, ఉపాధ్యాయులు మల్లికార్జున, ఇంద్రావతి, వెంకటరత్నం, ప్రసాద్‌ రెడ్డి, చంద్రశేఖర్‌ తదితరులు పాల్గొన్నారు.

ఉత్సవ శోభితం.. ఊరూవాడా సంబరం

- మండపాలకు చేరుకున్న గణనాథులు
- నేటి నుంచి పూజలందుకోనున్న లంబోదరుడు
- పూజా సామగ్రి కొనుగోళ్లతో కిటకిటలాడిన మార్కెట్‌లు
- మట్టి విగ్రహాల వైపు జనాల ఆసక్తి



రైల్వేకోడూరు అర్బన్‌: పట్టణంలో పూలు, పండ్లకు ఏర్పడిన గిరాకీ



రాజంపేట టౌన్‌: శివాలయం సర్కిల్‌లో భారీ సెట్‌తో మండపం



రాయచోటి టౌన్‌: అరటి ఆకులు, పండ్లు కొనుగోలు చేస్తున్న ప్రజలు

రాజంపేట టౌన్‌ : పల్లె, పట్టణం అన్న తేడా లేకుండా జరుపుకునే పండుగ వినాయక చవితి. వినాయక చవితి వేడుకలను ఘనంగా నిర్వహించుకునేందుకు గత కొద్ది రోజులుగా ప్రజలు, భక్తులు ఎదురు చూస్తున్నారు. ఉత్సవ కమిటీ ప్రతినిధులు రాత్రింబవళ్లు కష్టపడి మండపాలను ఏర్పాటు చేశారు. ఇప్పుడు గణనాథుడి పండుగ రానేరావడంతో ఎటుచూసినా సందడి వాతావరణం కనిపిస్తోంది. పండుగను ఇళ్లల్లోనే కాక తమ ప్రాంతాల్లో ఏర్పాటు చేసే వినాయక స్వామి మండపాల వద్ద ఘనంగా జరుపుకునేందుకు అవసరమయ్యే పూజా సామగ్రి కోసం పట్టణాల్లోని ప్రజలే కాక గ్రామీణ ప్రాంతాలకు చెందిన ప్రజలు వ్యాపార సముదాయాలకు తరలిరావడంతో అన్ని ప్రధాన పట్టణాల్లో మంగళవారం రహదారులన్ని జనసంద్రమయ్యాయి. దీంతో అన్ని ప్రాంతాల్లో మార్కెట్‌ సముదాయాలు పండుగ శోభను సంతరించుకున్నాయి. ఇదిలావుంటే మండపాల్లో గణపయ్యను కొలువుదీర్చేందుకు కమిటీ ప్రతినిధులు మండపాలను శోభాయమానంగా తీర్చిదిద్దారు. పలు ప్రాంతాల్లో విద్యుత్‌ దీపాలతో ఏర్పాటు చేసిన వినాయక స్వామి ప్రతిమలు చూపరులను విశేషంగా ఆకట్టుకుంటున్నాయి. కాగా విద్యావంతులు, పర్యావరణ ప్రేమికులు మట్టి విగ్రహాలను కొనుగోలు చేసేందుకు ఆసక్తి చూపారు. వినాయకుడి విగ్రహాలను ప్రత్యేక వాహనాల్లో తీసుకెళుతున్న యువకులు, పిల్లల ఆనందానికి ఆకాశమే హద్దయింది. దారిపొడవునా జై గణేషా, జైజై గణేషా అంటూ నినాదాలు చేశారు. కాగా బుధవారం నుంచి గణనాథుడు వివిధ ప్రాంతాల్లో తొమ్మిది రోజుల పాటు పూజలందుకోనున్నారు.

అప్రమత్తంగా పోలీసులు

వినాయక చవితి వేడుకలను పురస్కరించుకొని పోలీసులు అప్రమత్తంగా ఉన్నారు. వినాయక స్వామి విగ్రహాలను ఏర్పాటు చేసే అన్ని ప్రాంతాల్లో కలియ తిరుగుతున్నారు. ఆన్‌లైన్‌లో విగ్రహం ఏర్పాటుకు విధిగా పోలీసుశాఖ అనుమతి తీసుకోవాలని ఉత్సవ కమిటీలకు సూచిస్తున్నారు. పలువురు పోలీసులు దగ్గరుండి ఆన్‌లైన్‌లో అనుమతులు చేసే విధానం గురించి ఉత్సవ కమిటీ ప్రతినిధులకు తెలియచేస్తున్నారు. అలాగే ఉత్సవాలను ప్రశాంతంగా జరుపుకోవాలని, ఎవరైనా శాంతిభద్రతలకు విఘాతం కలిగించేలా ప్రవర్తిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరికలు జారీ చేశారు.

ఉత్సవాలకు సర్వం సిద్ధం

రాయచోటి టౌన్‌ : గణనాథుడి పూజ కోసం సర్వం సిద్ధం చేస్తున్నారు. నేడు వినాయక చవితి సందర్భంగా స్వామి వారి పూజకు కావాల్సిన పండ్లు, కాయలు, ఆకులు, చెరుకు గడెలు, గరిక, వంటివి అమ్మకాలకు సిద్ధంగా ఉంచారు. బుధవారం వినాయక చవితి సందర్భంగా రాయచోటిలో ప్రత్యేక మార్కెట్‌ ఏర్పండింది. ఈ మార్కెట్‌లో స్వామి పూజకు ఇష్టమైన పండ్లు, కాయలు, గడ్డి, చెరుకులు ఆర్టీసీ బస్టాండ్‌ పరిసర ప్రాంతాలలో చిరువ్యాపారులు ప్రత్యేక షాపులు ఏర్పాటు చేశారు.

మండపాలకు తరలిన విగ్రహాలు

గాలివీడు : గణేష్‌ నవరాత్రులకు గ్రామాలు ముస్తాబయ్యాయి. బుధవారం వినాయక చవితిని పురస్కరించుకొని మండలవ్యాప్తంగా గణనాథులు కొలువుదీరనున్నారు. ఇప్పటికే గణేష్‌ మండలి కమిటీల ఆధ్వర్యంలో మండపాలను సిద్ధం చేశారు. మండపాలను అలంకరించి, విద్యుత్‌ దీపాలు ఏర్పాటు చేశారు. వివిధ ఆకృతుల్లో చేపట్టిన నిర్మాణాలతో మండపాలు ఆకట్టుకుంటున్నాయి. మంగళవారం ఉదయం నుంచే భారీ విగ్రహాలను కొనుగోలు చేసి వాహనాల్లో మండపాలకు తరలించారు. నేడు ఉదయం చవితి పూజలు నిర్వహించి నవరాత్రి ఉత్సవాలను ప్రారంభిస్తారు. నవరాత్రులను పురస్కరించుకుని మార్కెట్లో సందడి వాతావరణం నెలకొంది.

పట్టణంలో పండుగ సందడి

రైల్వేకోడూరు అర్బన్‌ : రైల్వేకోడూరు నియోజకవర్గ వ్యాప్తంగా వినాయక చవితి సందడి నెలకొంది. నేడు వినాయక చవితి పురస్కరించుకొని గ్రామాలలో వినాయక మండపాలు ఏర్పాటు చేసుకొని విగ్రహాలను తరలించారు. పట్టణంలో ప్రతి వీధిలో వినాయక ప్రతిమలు వివిధ రూపాలలో ఏర్పాటు చేశారు. సుమారు వందల సంఖ్యలో విగ్రహాలను తరలించారు. వినాయక చవితి ఘనంగా నిర్వహించుకోవడానికి యువకులు పెద్దఎత్తున ఏర్పాట్లు చేస్తున్నారు. దీంతో మంగళవారం పట్టణంలోని ప్రధాన రహదారి ప్రజలతో కిటకిటలాడింది. చిన్న విగ్రహాలు, అరటి పిలకలు, పూలు, పండ్ల వ్యాపారులకు గిరాకీ పెరిగింది.

91 గ్రామాల్లో విగ్రహాల ఏర్పాటు

పెనగలూరు : మండలంలోని 91 గ్రామాలలో వినాయక స్వామి విగ్రహాలను ఏర్పాటు చేస్తున్నట్లు ఎస్‌ఐ రవిప్రకాష్‌ రెడ్డి తెలిపారు. మంగళవారం పోలీసు స్టేషన్‌కు తొంభై ఒక్క అర్జీలు విగ్రహాలు పెట్టేందుకు వచ్చినట్లు చెప్పారు. కాగా గ్రామాలలో ఒకరిపై ఒకరు పెద్ద విగ్రహాలు తేవాలని పోటీలు పడి విగ్రహాన్ని తెచ్చుకున్నారు. మండల కేంద్రం పరిధి కొత్తపల్లిలో దువ్వూరు వేణుగోపాల్‌ రెడ్డి సొంత నిధులతో భారీ వినాయక స్వామి విగ్రహాన్ని తీసుకువచ్చారు. విగ్రహంతో పాటు భజనలు, డప్పులు వాయిస్తూ భారీగా టపాసులు పేల్చుతూ విగ్రహాలను గ్రామాలకు తరలించారు.

ఏయూలో పర్యావరణహిత గణేశుడు

రాజంపేట : బోయనపల్లిలోని అన్నమాచార్య యూనివర్సిటీలో మంగళవారం పర్యావరణ హిత గణేశుడు.. స్థిరమైన ఆశీర్వాదమనే అంశంపై అవగాహన సదస్సును నిర్వహించారు. విద్యార్థులకు పర్యావరణ రహిత గణేశ్‌ విగ్రహాల తయారీ, వినియోగం, ప్రతిష్టలో స్థిరత్వం ప్రాముఖ్యతపై విస్తృత అవగాహన కల్పించారు. ఎర్రమట్టి గణేశ్‌ విగ్రహాల వినియోగం ద్వారా నీటి కాలుష్యం తగ్గించడం, సింబాలిక్‌ హోమ్‌ విధానం ద్వారా సమాజంలో అవగాహన పెంచడం, తద్వారా భవిష్యత్‌ తరాలకు పర్యావరణ పరిరక్షణపై స్పష్టమైన సందేశాన్ని అందించడం వంటి అంశాలపై ప్రస్తావించారు. కార్యక్రమంలో హెచ్‌ఓడీ గౌతమి, అసోసియేట్‌ ప్రొఫెసర్‌ డా.టి.నరేష్‌కుమార్‌, ఫ్యాకల్టీ కో–ఆర్డినేటర్‌ రఘునాథరెడ్డి , సివిల్‌ విభాగం ఫ్యాకల్టీ సభ్యులు పాల్గొన్నారు.



పెనగలూరు: కొత్తపల్లి గ్రామానికి తరలుతున్న భారీ గణనాథుడు



గాలివీడు: మండపాలకు తరలుతున్న గణనాథులు



రాజంపేట టౌన్‌: విద్యుత్‌ దీపాల అలంకరణలో వినాయక స్వామి



రాజంపేట: ఏయూలో మట్టి గణపతులను అందచేస్తున్న దృశ్యం

మండలాభివృద్ధికి సహకరించండి



జడ్పీ సీఈఓను సన్మానిస్తున్న ఎంపీపీ మేడా

నందలూరు(రాజంపేట) : మండలాభివృద్ధికి జిల్లా పరిషత్‌ తరపున సహకరించాలని జిల్లా పరిషత్‌ చీఫ్‌ ఎగ్జిక్యూటివ్‌ ఆఫీసర్‌ సుబ్రమణ్యంను నందలూరు మండలాధ్యక్షుడు మేడా విజయభాస్కర్‌రెడ్డి కోరారు. మంగళవారం జడ్పీ సీఈఓ స్థానిక మండల పరిషత్‌ కార్యాలయానికి విచ్చేశారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ పెండింగ్‌లో ఉన్న అభివృద్ధి పనులను వెంటనే పూర్తి చేసేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. జడ్పీ నిధులు కేటాయింపులో నందలూరు మండలానికి ప్రాధాన్యత ఇవ్వాలని కోరారు. మండల పరిషత్‌ పరిపాలన సౌలభ్యం కోసం అవసరమైన చర్యలకు అనుమతించాలని కోరారు. జడ్పీ సహకారం మండల పరిషత్‌కు ఎంతో అవసరమన్నారు.

పార్కు, పైపులైను పనుల పరిశీలన

కడప – రేణిగుంట హైవేలోని మండల క్లాంపెక్స్‌ క్రాస్‌లో మారెమ్మగుడి సమీపం కన్యక చెరువు అలుగుల వద్ద రూరల్‌ అర్బన్‌ మిషన్‌ నిధులతో చేపట్టిన పార్కు పనులును జడ్పీ సీఈఓ సుబ్రమణ్యం పరిశీలించారు. అనంతరం ఎర్రచెరువుపల్లె సమీపంలో నిర్మితం చేస్తున్న మంచినీటి పైపు లైన్‌ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా జడ్పీ సీఈఓ సుబ్రమణ్యంను ఎంపీపీ మేడా విజయభాస్కర్‌రెడ్డి శాలువా కప్పి సన్మానించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ రాధాకృష్ణరాజు, మండల ఉపాధ్యక్షురాలు తుమ్మల భావన శ్రీధర్‌, ఎంపీటీసీలు, వైఎస్సార్‌ సీపీ నేతలు బద్రిరెడ్డి, మండల పరిషత్‌ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఎంపీ మిథున్‌ రెడ్డిని కలిసిన నాయకులు

వీరబల్లి : రాజంపేట పార్లమెంట్‌ సభ్యులు పెద్దిరెడ్డి వెంకట మిథున్‌రెడ్డిని విజయవాడ ఏసీబీ కోర్టు ప్రాంగణంలో మండల నాయకులు కలిసి యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎటువంటి ఆధారాలు లేకుండా ఎంపీపై అక్రమ లిక్కర్‌ కేసు పెట్టడం సరికాదని, కడిగిన ముత్యంలా ఆయన బయటకు వస్తారని వారు తెలిపారు. ఎంపీని కలిసిన వారిలో వీరబల్లి మాజీ ఎంపీపీ గాలివీటి విజయభాస్కర్‌ రెడ్డి, రాష్ట్ర ఎంపీపీల సంఘం ఉపాధ్యక్షుడు, ఎంపీపీ గాలివీటి రాజేంద్రనాథ్‌ రెడ్డి, వైఎస్సార్‌సీపీ పంచాయతీరాజ్‌ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గాలివీటి వీరనాగిరెడ్డి, రాజంపేట నియోజకవర్గ పబ్లిసిటీ వింగ్‌ ప్రెసిడెంట్‌ సత్యనారాయణ రెడ్డి, మండల వైఎస్సార్‌సీపీ అధ్యక్షులు మణిరాజు, రైతు విభాగం అధ్యక్షులు శ్రీరాములరెడ్డి, సర్పంచ్‌లు తాటిగుట్ల నాగిరెడ్డి, నరసింహులు, జిల్లా సోషల్‌ మీడియా ప్రెసిడెంటు నరేష్‌ స్వామి, నియోజకవర్గ ఐటీ వింగ్‌ ప్రెసిడెంటు, ఎంపీటీసీ పురుషోత్తం రెడ్డి, సిద్దారెడ్డి, బాలకృష్ణ తదితరులు ఉన్నారు.

హక్కులపై ఖైదీలకు అవగాహన ఉండాలి



ఖైదీల గదులను తనిఖీ చేస్తున్న జడ్జి బాబా ఫక్రుద్దీన్‌

రాజంపేట : జైలు లోపల హక్కులపై ఖైదీలకు అవగాహన కల్పించుకోవాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్‌ సివిల్‌ జడ్జి ఎస్‌.బాబా ఫక్రుద్దీన్‌ పేర్కొన్నారు. మంగళవారం రాజంపేట సబ్‌ జైలును ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సబ్‌జైలు లీగల్‌ ఎయిడ్‌ క్లినిక్‌ల ప్రాధాన్యతను తెలియచేశామన్నారు. ఉచితన్యాయ సహాయం, లీగల్‌ఎయిడ్‌ డిఫెన్స్‌ కౌన్సిల్‌ సిస్టంను వివరించామన్నారు. ఉచిత న్యాయసహాయాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. జైళ్లలో బాలనేరస్తులు ఉంటే గుర్తించడం, వారికి తగు న్యాయ సహాయం అందించడం జరుగుతోందన్నారు. అనంతరం జైలు పరిసరాలను పరిశీలించారు. టాయిలెట్స్‌ను, వంటగదుల స్థితిగతులను పరిశీలించారు. జైలు అధికారులకు తగు సూచనలు జారీ చేశారు. లీగల్‌ సర్వీసెస్‌ హెల్ప్‌లైన్‌ నంబరు 15100 ప్రచారంపై విస్తృత ప్రచారం అవసరమన్నారు. ఏవైనా సమస్యలు ఉంటే రాజంపేట మండల న్యాయ సేవా సమితి , జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కడపను సంప్రదించాలన్నారు.

పండుగను ప్రశాంతంగా జరుపుకుందాం



ఎల్లమరాజు చెరువు వద్ద నిమజ్జన ఏర్పాట్లు పరిశీలిస్తున్న సీఐ వెంకటేశ్వర్లు, ఎస్‌ఐ నవీన్‌ బాబు తదితరులు

చిట్వేలి : వినాయక చవితి పండుగను ప్రశాంతంగా జరుపుకోవాలని, నిబంధనలు అతిక్రమిస్తే ఇబ్బందులు తప్పవని ఎస్‌ఐ నవీన్‌ బాబు హెచ్చరించారు. బుధవారం వినాయక చవితిని పురస్కరించుకొని పోలీసు స్టేషన్‌లో మంగళవారం స్థానిక విలేకరులతో మాట్లాడుతూ మండలంలోని ఆయా గ్రామాల్లో ఉత్సవ కమిటీల ఆధ్వర్యంలో సుమారు 120 వినాయకుని విగ్రహాలను ఏర్పాటు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు. నిమజ్జనం తేదీలను ముందుగానే తెలపాలని, మైక్‌, డీజేలు పెట్టి ఇరుగుపొరుగు వారిని ఇబ్బంది పెట్టకూడదని, నిమజ్జనాలను సాయంత్రం 4 గంటలలోపు పూర్తి చేయాలని పలు నిబంధనలు విధించామని, అవసరమైతే బైండోవర్‌లు చేస్తామని ఎస్‌ఐ తెలియజేశారు. మండలంలోని 90 శాతం విగ్రహాలను ఎల్లమరాజు చెరువులో నిమజ్జనం చేసే అవకాశం ఉన్నందున మంగళవారం సీఐ వెంకటేశ్వర్లుతో కలిసి చెరువును సందర్శించామన్నారు. అవసరమైన ముందస్తు భద్రతా ఏర్పాట్లు చేస్తామన్నారు. ఉత్సవాలు ముగిసేవరకు తమ సిబ్బంది వారికి కేటాయించిన పంచాయతీలలోని విగ్రహాలు ఏర్పాటు చేసిన ప్రాంతాలను ఎప్పటికప్పుడు పర్యటిస్తూ సమాచారాన్ని తమ దృష్టికి తెస్తారన్నారు. పండుగను ప్రశాంతంగా జరుపుకోవడమే అందరి లక్ష్యం కావాలని ఎస్‌ఐ నవీన్‌ బాబు విజ్ఞప్తి చేశారు.

డీ ఫార్మసీని 'కౌశలం'లో చేర్చాలి

రాయచోటి జగదాంబసెంటర్‌ : రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వం చేపట్టిన కౌశలం సర్వేలో డీ ఫార్మసీ కోర్సు చేర్చాలని అన్నమయ్య జిల్లా బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు ఇడగొట్టు నాగేశ్వరరావు ప్రభుత్వాన్ని డిమాండ్‌ చేశారు. సోమవారం రాయచోటిలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కౌశలం సర్వేలో డీ ఫార్మసీ కోర్సు లేక ఏ డిగ్రీ పెట్టాలో తెలియక అటు సచివాలయ ఉద్యోగులు, ఇటు నిరుద్యోగులు ఆందోళన చెందుతున్నారన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 20 వేల మంది డీ ఫార్మసీ చేసిన నిరుద్యోగులు ఉన్నారని వీరంతా ఆందోళనకు గురవుతున్నారని తెలిపారు. వీరితో పాటు ప్రస్తుతం డీ ఫార్మసీ చదువుతున్న విద్యార్థులు కూడా ప్రభుత్వం ప్రవేశపెట్టే నిరుద్యోగభృతి కావచ్చు ఉద్యోగాల్లో కావచ్చు డీ ఫార్మసీని గుర్తించాలని కోరారు. ప్రభుత్వం వెంటనే కౌశలం సర్వేలో డీ ఫార్మసీ ఆరు సంవత్సరాల కోర్సును చేర్చాలని ఆయన డిమాండ్‌ చేశారు.

మధ్యాహ్న భోజనం పరిశీలన



ఓబులవారిపల్లె : విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం అందించాలని ప్రత్యేకాధికారి సదాశివరెడ్డి పేర్కొన్నారు. మంగళవారం తల్లంవారిపల్లి జిల్లా పరిషత్‌ ఉన్నత పాఠశాల నందు మధ్యాహ్న భోజనాన్ని వారు పరిశీలించారు. విద్యార్థులతో కలిసి భోజనం చేసిన తరువాత వారు సంతృప్తి వ్యక్తం చేశారు.

రాష్ట్రస్థాయి క్విజ్‌ పోటీల్లో సత్తా



అంజుమ్‌ను అభినందిస్తున్న డీఎంహెచ్‌ఓ

రాయచోటి జగదాంబసెంటర్‌ : రాష్ట్ర ఎయిడ్స్‌ నియంత్రణ సొసైటీ ఆదేశాల మేరకు జిల్లా ఎయిడ్స్‌ నియంత్రణ, నివారణ సంస్థ జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అన్నమయ్య, జిల్లా ఇంటర్మీడియట్‌ విద్యాశాఖ సంయుక్తంగా నిర్వహించిన పోటీలలో మదనపల్లె కృష్ణారెడ్డి సిద్దార్థ కాలేజీకు చెందిన నూల అంజుమ్‌ రాష్ట్ర స్థాయి ప్రథమ బహుమతి పొందింది. ఈ మేరకు మంగళవారం రాయచోటిలో డీఎంహెచ్‌ఓ డాక్టర్‌ లక్ష్మీనరసయ్య ప్రతిభ చాటిన అంజుమ్‌ను అభినందించారు.

మదర్‌ థెరిసాకు ఘన నివాళి



పుల్లంపేట : మండలంలోని దళవాయిపల్లి ఆదర్శ ప్రాథమిక పాఠశాలలో మంగళవారం మదర్‌ థెరిసా జయంతిని పురస్కరించుకొని, ఉపాధ్యాయులు, విద్యార్థులు మదర్‌ థెరిసా చిత్రపటానికి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయుడు రమణ మాట్లాడుతూ ప్రార్థించే చేతులుకున్నా సాయం చేసే చేతులు మిన్నా అన్న సందేశానిచ్చి పేదలపాలిట పెన్నిధిగా, అభాగ్యుల పాలిట ఆశాజ్యోతిగా సర్వజనులకు సేవామూర్తిగా మదర్‌ థెరిసా నిలిచారని కొనియాడారు.

మెరుగైన విద్య అందించాలి

ఓబులవారిపల్లె : ప్రైవేటు పాఠశాల నిర్వాహకులు నిబంధనలు పాటిస్తూ విద్యార్థులకు మెరుగైన విద్య అందించే విధంగా చర్యలు తీసుకోవాలని ఎంఈఓ శివరాంరెడ్డి పేర్కొన్నారు. మండల కేంద్రంలోని ఎంఆర్‌సీ నందు మండలంలోని ప్రైవేటు పాఠశాలల నిర్వాహకులు మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎంఈఓను ఘనంగా సత్కరించారు.

ఎరువుల దుకాణాలు తనిఖీ

చిట్వేలి : మండలంలోని ఎరువుల దుకాణాలను మంగళవారం విజిలెన్స్‌ టీమ్‌ మురళీ కృష్ణ (ఫారెస్టు రేంజ్‌ అధికారి) ఆధ్వర్యంలో ఆకస్మిక తనిఖీ చేశారు. అన్ని ఎరువులను, స్టాక్‌ రిజిస్టర్‌లను, బిల్‌ బుక్స్‌ను, గోడౌన్‌లను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎరువులను అధిక ధరలకు అమ్మినా, నాణ్యతలేని, అనుమతిలేని ఎరువులను అమ్మినా, అక్రమంగా నిల్వ చేసినా కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో మండల ఏఓ సుధాకర్‌, విజిలెన్సు కానిస్టేబుల్‌ టిప్పు సుల్తాన్‌ తదితరులు పాల్గొన్నారు.

పెండింగ్‌ పనులు పూర్తి చేయాలి



మాట్లాడుతున్న డ్వామా పీడీ వెంకటరత్నం

లక్కిరెడ్డిపల్లి : పెండింగ్‌లో ఉన్న పనులను త్వరితగతిన పూర్తి చేయాలని డ్వామా పీడీ వెంకటరత్నం పేర్కొన్నారు. మంగళవారం స్థానిక ఎంపీడీఓ సభా భవనంలో రామాపురం, లక్కిరెడ్డిపల్లి మండలాలకు చెందిన ఉపాధి హామీ పథకం సిబ్బందితో రివ్యూ సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఉపాధి హామీ పథకం లక్ష్యాలు చేరుకోవాలన్నారు. కూలీలకు వందరోజులు పని కల్పించడానికి ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. మంజూరు అయిన రైతులతో మామిడి మొక్కలు మొక్కలు నాటించాలని, మినీ గోకులాలు పూర్తి చేయాలని, పెండింగ్‌ సోప్‌ పిట్‌, ఫారం పాండ్‌ పూర్తి చేయాలన్నారు. సిబ్బంది నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తప్పవన్నారు. సమావేశంలో క్లస్టర్‌ ఏపీడీ లక్ష్మీనరసయ్య, మండల అభివృద్ధి అధికారి ఉషారాణి, ఏపీఓలు మురళీ, పెంచలయ్య, సాంకేతిక సహాయకులు తదితరులు పాల్గొన్నారు.

మేడాపై ఆరోపణలు సరికాదు



యం.చిదంబర్‌రెడ్డి

సంబేపల్లె : రాజ్యసభ సభ్యుడు మేడా రఘునాథరెడ్డిని విమర్శించడం మంచిది కాదని అఖిల భారత పంచాయతీ పరిషత్‌ జనరల్‌ సెక్రటరీ చిదంబర్‌రెడ్డి అన్నారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ అజాతశత్రువు, అందరితో కలుపుగోలుతనం, స్నేహశీలి, పేద ప్రజల ఆపద్బాంధవుడు, పార్టీలు, కులమతాలకు అతీతంగా ఎంపీ మేడా ఎన్నో సేవా కార్యక్రమాలు చేశారన్నారు. కాంగ్రెస్‌ పార్టీ అధ్యక్షులు మల్లికార్జున ఖర్గేని పార్లమెంట్‌లో కలిస్తే వైఎస్‌ఆర్‌సీపీని ఎంపీ మేడా వీడుతున్నట్టు దుష్ప్రచారం చేయడం ఎల్లో మీడియాకే చెందిందన్నారు. దేశంలోని అన్ని పార్టీల నాయకులతో పరిచయాలు ఉన్న వ్యక్తి, అన్ని పార్టీల ప్రముఖులు, రాజకీయాలకు అతీతంగా ఎంపీ మేడాను అభిమానిస్తారన్నారు. ఇకనైనా విమర్శలు చేసే ముందు విచక్షణ కోల్పోకూడదని ఆయన హితవు పలికారు.

తాగునీటి పైప్‌లైన్‌కు నిధులు

పెనగలూరు : మండలంలోని ఓబిలి దళితవాడకు రూ. 5 లక్షలు మండల నిధులు కేటాయించినట్లు ఎంపీడీఓ విజయారావు, వైస్‌ ఎంపీపీ విజయ్‌ రెడ్డిలు తెలిపారు. ఓబిలి దళితవాడకు చెయ్యేరు నుంచి తాగునీరు రాలేదని గ్రామస్తులు కొండూరు అజయ్‌ రెడ్డి, విజయ్‌ రెడ్డిల దృష్టికి తీసుకెళ్లారు. దీంతో అజయ్‌ రెడ్డి స్పందించి మండల ఫండ్స్‌ నుంచి రూ. 5 లక్షల నిధులను కేటాయించారు. ఎంపీడీఓ దగ్గరుండి పైప్‌లైన్‌ పనులు చేయిస్తున్నారు. పనులు చేపడుతుండటంతో ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.